



# న్యూ బాంబే టైలర్స్


మహమ్మద్ ఖదీర్‌బాబు


ఈ కత మా ఊర్లో జరిగింది. మా ఊరంటే మా ఊర్లోని రైల్వేరోడ్డులో జరిగింది. వాస్తవానికి యిది ఏనాడో ముగిసిపోవాల్సిన కతేగానీ యింకా ముగిసేటట్టులా.

పైపెచ్చు మళ్లా బిగినయ్యేటటట్టుందని మొన్న మా ఊరికి పోయినప్పుడు మా చిన్నాయన మాటల వల్ల అర్థమైంది. అర్థమయ్యాక యిది చెప్పాల్సిన కతే అని నాకు అనిపించింది.

ఎందుకనంటే ఇది నాకు బాగా తెలిసిన కత.

చిన్నప్పట్నుంచి నేను చూసిన ఒక మనిషి కత.

మాది నెల్లూరు జిల్లా కావలి. హోల్‌సేల్ గుడ్డలకీ, పంటరెడ్ల పరపతికీ మా ఊరు పెట్టిందిపేరేగానీ ఈ రెండింటికంటే కూడా రైల్వేరోడ్డులోని బాంబే టైలర్సు షాపుకే మా ఊరు ఫేమస్సు.

నేను యింతుంటా బాంబే టైలర్సు షాపు బోర్డు చూసినప్పుడు. మా నాయన కోసం రైల్వేరోడ్డుకి పోయినప్పుడు, మా కరెంటు అంగడిలో కూర్చొని గుర్రపునాడ అయస్కాంతాలతో ఆడుకునేటప్పుడు మధ్యమధ్యలో మా అంగడి ఎదురుగా ఉన్న బాంబే టైలర్సు షాపునీ దాని నెత్తి మీదుండే బాంబే టైలర్సు బోర్డునీ చూస్తా ఉండేవాణ్ణి.

బులుగు రంగు పూత మీద, తెల్లటి పెద్ద పెద్ద అక్షరాలతో 'NEW BOMBAY TAILORS' అని మెరిసిపోతా ఉండే ఆ బోర్డంటే నాకు బలే యిష్టం. కానీ దానికి కుడిపక్కన- అడుగుభాగంలో చిన్న అక్షరాల్లో మినుకు మినుకుమంటా ఉండే ప్రొ. షేక్ పీరుభాయి అన్న పేరును చూస్తే మాత్రం బలే భయం.

నాకే కాదు- నడుమంత ఎత్తుండే కటింగ్ టేబిల్ అవుతల నిలబడి, మెడలో తోలు టేపు వేలాడేసుకొని, నోటి నిండా ఎర్రటి ఆకువక్క నమలతా, చేతితో కత్తెర ఆడిస్తా, 'సలాము లేకుం పీరుభాయ్,' అని దారిన పోయేవాళ్లు సలామ్ చేస్తే 'వాలేకుం సలామ్,' అన్నట్టు చేత్తో సైగచేసే పీరుభాయిని చూస్తే పెద్దోళ్ల సంగతేమోగానీ మా రైల్వేరోడ్డులోని పిలకాయలందరికీ బలే భయం. పనీపాటా లేకుండా యాడైనా ఎవురైనా పెత్తనాలు చేస్తా, సిగరెట్లు, బీడీలు తాక్కుంటా కంట పడినారంటే చాలు నాలిక కొరకతా చేతికందిన కత్తెరెత్తుకొని తరుముకునేవాడాయన.

"పని చేసుకొని సావరాదంట్రా కంజాత్ నాయాళ్లారా..." అని ఒక్క గదమాయింపు గదిమినాడంటే ఎక్కిడివాళ్లక్కడ పరార్.

'కంజాత్' అనే మాటకు ఆయనకు అర్థం తెలుసో తెలియదోగానీ అదాయన ఊతపదం, "కంజాత్ అంటే 'తక్కువజాతోడు' అని అర్థం. కానీ పీరుభాయి మాత్రం తక్కువ జాతోడుకాదు. పెద్ద జాగీరుదారు. ఉదయగిరి తాపున ఉన్న సీతారాంపురం జాగీరు వీళ్ల తాత ముత్తాతలదే. కానీ పీరుభాయి హయాం వచ్చేసరికి అంతాపోయింది.

దాంతో పీరుభాయి మిగిలినాడు. ఆయన డొక్కలో కాస్తో కూస్తో ఉర్దూ అరబీ చదువు మిగిలింది.

"నెల్లూరు పిల్చుకపోయి పెద్ద మదర్‌సాలో చేర్పిస్తా. వాళ్లే కూడూ గుడ్డా ఇచ్చి నిన్ను చదివిపిచ్చుకుంటారు. ఆనేక ఉస్తాద్‌ను చేసి జీతానికి పెట్టుకుంటారు. నిన్ను పెంచేది నా వల్లగాదు," అన్నాడట పీరుభాయి నాయన పేదరికానికి తట్టుకోలేక.

పీరుభాయి ఒప్పుకోలా. ఉర్దూ చెప్పే ఉస్తాదు కావటం కంటే గుడ్డలు కుట్టే ఉస్తాదు కావడమే మేలని ఆ పనికి బయలుదేరినాడు.

అప్పట్లో మా ఊర్లో యిద్దరో ముగ్గురో టైలర్లు. చేతి మిషన్లు పోయి అప్పుడప్పుడే కాలి మిషన్లు వస్తు న్నాయి. కుర్తా పైజామాలు వదిలి రంగూన్ ప్యాంట్లు కుడతా ఉన్నారు. వచ్చినా రాకపోయినా టైట్‌ఫిటింగ్ జతలకి ట్రయల్స్ వేస్తా ఉన్నారు. అప్పట్లో ఆ ఫ్యాషన్‌లో ఎవరు పనితనం చూపితే వారికే డబ్బులు. ఆ డబ్బుల్ని 'జంగం ఎలమంద' సంపాదించేవాడు. ఎలమంద సామాన్యుడు కాదు. కులానికి జంగమోడేగానీ టైలరింగ్ పనిలో పండి పగిలినాడు. మనిషిని తీసుకొచ్చి ఎదురు గ్గా నిలబెడితే కొలతలు తీసుకోకుండా గుడ్డలు కుట్టిచ్చే వాడంట.

అట్టాంటి పనోడి దగ్గర పని నేర్చుకుందామని చేరాడు పీరుభాయి.

ఉస్తాద్‌కి చేస్తే ఊరికి చేసినట్టే అని సామెత. దానికి లోటు రానియ్యకుండా ఎలమందకు అణిగి మణిగి సేవలు చేసినాడు పీరుభాయి. ఇంటి ఆడ మనిషి కూరగాయలు తెమ్మంటే తెచ్చిచ్చేవాడు. చెట్టెక్కి చిగురు కోసిమ్మంటే కోసిచ్చేవాడు. కోడిపందేల పిచ్చిలో పడి ఆదివారం ఆదివారం సంకలవారి తోటకు తోడు రమ్మని ఎలమంద పిలిస్తే అట్నే అని వెళ్లేవాడు. ఆఖరికి ఆ మనిషి తాగి పడిపోతే మోసుకొచ్చి ఇంట్లో పడుకోబెట్టే వాడు.

ఎలమందకి ఆ కష్టం నచ్చింది. పీరుభాయిలోని శ్రద్ధ నచ్చింది. పని నేర్పించినాడు. పీరుభాయితో కలిసి గుడ్డలు కత్తిరించడంలో ఐడియాలు వేసి ఆయన కూడా పని నేర్చుకున్నాడు. పీరుభాయికి పని వచ్చింది అని అనుకున్నాక, ఇంక నేర్పించాల్సిందేమీ లేదు అని గ్రహించాక ఒక మంచిరోజు చూసుకొని, "నా పేరు చెప్పి బతుక్కుపోరా," అని అంపకాలు పెట్టి దేశం మీదకు ఒదిలినాడు.

అయితే పీరుభాయి వెంటనే దేశంమీద పడలా. నేర్చుకున్న పని సరిపోద్దా లేదా అని అనుమానపడ్డాడు. గురువు పనే శిష్యుడికొస్తే అందరూ గురువు కాడికే పోతారుగానీ శిష్యుడికాడికి ఎందుకు వస్తారు అని సందేహపడినాడు. బాగా ఆలోచించాక గురువు కంటే ఒకాకు ఎక్కువ చదివితేపోదా అని పంతం పట్టినాడు.

ఆ పంతం అతణ్ణి నిలువనియ్యలా. ఆ మరు సటి వారమే బొంబాయికి ప్రయాణం కట్టించింది.

అప్పట్లో బొంబాయిలో పుట్టినోడే టైలరు. బొంబాయిలో నేర్చిందే కటింగు. బొంబాయిలో కుట్టేదే ఫ్యాషను.

ఆ బొంబాయిలో ఉండేది మనకంటే మొనగాళ్లా అనుకున్నాడు పీరుభాయి.

బొంబాయి పోయినాక, ఒకటి రెండు తావులు తిరిగినాక, మంచి పనోడెవడో విచారించుకొని, వాడి కాళ్లుగడ్డాలు పట్టుకొని పనిలో కుదిరిపోయాడు. పగలు పొద్దస్తం కుట్టడం. రాత్రిళ్లు ఆడా యీడా పొణుకోవడం, ఎట్టోకట్ట పొట్ట గడుపుకోవడం.

అక్కడంతా పీరుభాయిని 'మదరాసీ' అని పిలిచే వారు. కానీ ఆ మాటంటే పీరుభాయికి సర్రన ఎక్కేది. 'నా పేరు పీరుమియా,' అని రోషంగా తల ఎగరేసే వాడు. 'మాది నెల్లూరు,' అని జవాబు చెప్పేవాడు.

ఆదరాబాదరాగా పనిచేయడం, అర్ధ మనసుతో పనిచేయడం పీరుభాయి రక్తంలో లేదు. కుదురుగ్గా చేయాలి. మొదలెట్టిన పని అంతూ ఐపూ చూసి సక్ర మంగా పూర్తి చేయాలి అనేది ఆయన తత్వం. ఆ తత్వం వల్ల ఒకరోజు కుట్టేపనిలో రొంత ఆలస్యం అయ్యిందట దాంతో బొంబాయి ఉస్తాద్‌కు కోపం వచ్చేసింది.

"సాలా... కామ్‌చోర్... మదరాసీ," అని గొణిగి నాడంట.

ఆ మాటలు పీరుభాయి చెవిన పడిపోయినాయి. అంతే. పిడికిట్లో కత్తెర యిముడ్చుకొని ఒక్క దూకు దూకినాడు. పని నేర్పే గురువని కూడా చూడకుండా లంఘించినాడు. దెబ్బలు అయినాయి. గుద్దులయి నాయి. చివరకు కుడిచేతిలో అంగుళం లోతున దెబ్బ మిగిలింది. ఆ తర్వాత అది తెల్లటిచారలా అట్టే ఉండి పోయింది.

గొడవ జరిగాక 'నేర్చుకుంది చాల్లే' అనుకున్నాడు పీరుభాయి. కావలి వెళ్లి తడాఖా చూపిద్దాం అని బయలుదేరినాడు. కావలి వచ్చాక తెలిసినవాళ్లని కలిశాడు. ఊరంతా తిరిగినాడు.

బంకు వద్దు.

షాపు పెట్టాలి.

ముందు ముందు నలుగురు పిలకాయలు చేరి నాలుగు మిషన్లు టకటకలాడాలి అని నిశ్చయించు కున్నాడు.

అందుకు అనువుగా రైల్వేరోడ్డులో షేకుమియా గారి పాతకాలపు దుకాణం కనిపించింది. దానికి రిపేర్లు

చేయించి బాడిగ మాట్లాడుకున్నాడు. కసుమూరు దర్గాకు పోయి టెంకాయ కొట్టొచ్చి రంగంలో దిగినాడు.

వాళ్లనీ వీళ్లనీ అప్పులడిగి, చేబదుళ్లు తీసుకొని, ఉన్నవి జమచేసి మొత్తం మీద పెట్టుబడి సంపాదించినాడు. ఆ డబ్బుతో మద్రాసు వెళ్లి హార్బర్‌లో బిల్లులు లేకుండా రెండు సింగర్ మిషన్లు కొన్నాడు. మూర్ మార్కెట్‌లో తిరిగి కత్తెరలు, స్కేళ్లు, టేపులు కొన్నాడు. నాలుగు డబ్బులు పోయినా కరెంటుతో పనిచేసే ఇస్త్రీ పెట్టే మేలని దాన్ని కొన్నాడు.

అన్నింటిని కట్టగట్టి లారీలో వేసుకొని తీసుకొచ్చాడు.

ఇవన్నీ ఒకెత్తయితే షాపుకు తగిలించాల్సిన బోర్డెక్కటే ఒకెత్తు. అది చిన్నా చితగ్గా ఉండకూడదు. దర్జాగా ఉండాలి. నవాబీగా కనిపించాలి. 'బాంబే టైలర్స్' అనే యింతెత్తు అక్షరాలతో దగదగలాడిపోవాలి. దాని కింద ప్రొ. ఖాజాపీరు అనే పేరు ఊరంతా తెలియాలి. అదీ పీరుభాయి కోరిక.

ఆ కోరికకు తగినట్టే బోర్డు తయారైంది. షాపు నెత్తిమీద నిలబడి కిరీటంలా మెరిసి పోయింది. షాపు ఓపెనింగ్‌కు వచ్చినోళ్లు పీరుభాయి తట్టు, బాంబే టైలర్సు బోర్డు తట్టు మార్చి మార్చి చూసి టీలు తాగి వెళ్లారు. చల్లగా ఉండమని కొందరు పెద్దలు దువా చేస్తే, యింకొందరు పెద్దలు కుట్టడానికి గుడ్డలు ఇస్తాంలే అని హామీ ఇచ్చినారు.

అట్టా ఆరోజున కావలి రైల్వే రోడ్డులో బాంబే టైలర్సు షాపు పుట్టింది. ఎమ్మట్నే దాని పేరు పాకడమూ మొదలయ్యింది.

"కొత్త పిల్లోడు... బొంబాయెల్లి కుట్టుపని నేర్చుకొచ్చాడంట."

"కటింగు పనిలో ఎమ్‌డన్‌గా ఉన్నాడయ్యా పిల్లోడు."

"ఇంక జంగం ఎలమంద నెత్తిన చెంగేసుకోవాల్సిందే."

ట్రంకు రోడ్డులో, పాతూరులో, ఐదులాంతర్ల సెంటరుకాడ కాస్త డబ్బున్న పిలకాయలకు బాంబే టైలర్స్ పేరు తెలిసిపోయింది. పీరుభాయి టైట్‌ఫిటింగ్ కుడితే దానికిక తిరుగులేదనే పేరు బడిపోయింది. అప్పటిదాకా మా ఊరి పంటరెడ్లకు నెల్లూరు, మద్రాసుల్లో ఉండేవాడే టైలరు. కానీ యిప్పుడు రైల్వే రోడ్డోడు కూడా టైలరే అని తెలిసొచ్చింది. నాలుగైదు వందల ఎకరాల ఆసామైన దొడ్ల పెదరెడ్డంతటివాడు పీరుభాయిని యింటికి పిలిపించుకొని కొలతలు యివ్వడం మొదలుపెట్టినాడు.

కొత్తల్లో పీరుభాయి సైకిలు రెడ్ల ఇళ్ల ముందర ఆగి కనిపించేది. ఆ తర్వాత రెడ్డి గార్ల ఒంటెద్దు బండ్లే బాంబే టైలర్సు షాపు ముందర వరుసకట్టి అవుపించేవి.

నెమ్మది నెమ్మదిగా పీరుభాయి పేరు బాంబే టైలర్స్ అయ్యింది. మా ఊర్లో ఆ షాపాక కొండగుర్తు అయ్యింది. రైల్వేరోడ్డులో ఎవరికైనా ఏ అడ్రసైనా చెప్పాలంటే 'బాంబే టైలర్స్ ఉళ్లా... అణ్ణుంచి నాలుగడుగులు వేసినావంటే," అని చెప్పడం మొదలుపెట్టినారు జనం.

దారిన పోయేవాళ్లెవరైనా, 'సలాములేకుమ్ బాంబే టైలర్స్ సాబ్," అనంటే అది తన పేరే అయినంతగా పీరుభాయి ఛాతీ పొంగిపోయేది. అలా పొంగిన ఛాతీ నీడన బతకడానికి కూడూ గుడ్డా కుదురుగ్గా లేని పిలకాయలు ఆయన దగ్గర చేరేవాళ్లు.

"పని నేర్పి ఉస్తాద్ నీ పేరు చెప్పుకొని బతుకుతాము," అని ఆయన దగ్గర కత్తెర పట్టుకోవడం నేర్చుకుని, తిడితే పడి కొడితే సహించి ప్రేమగా వివరిస్తే గ్రహించి పనిమంతులయ్యి బంకులు పెట్టుకొని బతికినారు చాలామంది. అప్పట్లో కావలి చుట్టుపక్కల 'పీరుభాయి శిష్యుడు,' అనంటే పిల్లనిచ్చేవాళ్లు.

పీరుభాయికి ఒక మగబిడ్డ కలిగినాడు. యిద్దరు ఆడపిల్లలు పుట్టినారు. సంపాదన ఊపుగా ఉన్నా దాని యావలేని మనిషి కాబట్టి పెంకుటిల్లు చాల్లే అని కట్టుకున్నాడు. రెండు మిషన్లున్న షాపును ఆరు మిషన్లున్న షాపుగా చేసుకున్నాడు. కాజాలు, గుంజీలు కుట్టేదానికి చిన్న పిలకాయలను పెట్టుకొని వాళ్లను సాకతా అదే పుణ్యం అనుకున్నాడు.

తన కింద పని చేసే పిలకాయల్లో ఎవరినైనా 'శబ్బాష్' అని పీరుభాయి మెచ్చుకున్నాడంటే ఆ మాటాక సర్టిఫికెటు. ఆ పనోడు పనిమంతుడయ్యాడని అర్థం.

అయితే ఈ శబ్బాష్‌గిరి శిష్యులకేగానీ కొడుక్కులా. ఎన్ని స్కూళ్లు మార్చినా వాడికి చదువు అబ్బలా. కొడుకు బి.ఎ. చదవాలన్న పీరుభాయి ఆశ హైస్కూలికే అంతమయ్యింది.

"చదువుకేమి సంబడం. నువ్వు బతకడంలా. నీ పని నేర్చుకొనివాడు కూడా బతుకుతాడులే" అంది బీబీ.

పీరుభాయి పనంటే చిన్న కతనా? మంగలోడికి తలకట్టు కొలత తెలియాలి. చాకలోడికి గుడ్డ నైజం అలవడాలి. కుమ్మరోడికి మట్టితత్వం బోధపడాలి.

కుట్టుపని చేసేవాడికి రూపమర్మం తెలిసిరావాలి. గుడ్డలు కుట్టడం అంటే కొలతనుబట్టి కుట్టడం కాదు. మనిషినిబట్టి కుట్టడం.

అట్టా కుట్టడం పీరుభాయి విద్య. ఆ విద్య కొడుక్కి బోదపడలేదు. వాడికి కటింగు పని చేతకాలేదు.

"నువ్వు కటింగు చేస్తావుగా. చాల్లే. నేను మిషను కుడతా" అన్నాడు కొడుకు.

మిషను కుట్టడం కూలిపనితో సమానం. సిమెంటు, ఇసుకను మేస్త్రి చూపించిపోతే వాటిని కలుపుకుంటా కూర్చునే మొద్దు పని అది.

అయినాగానీ అంతకు మించి చేసేదిలాక యింకోదోవ కానరాక 'సరే' అన్నాడు పీరుభాయి.

ఆయన ఆ మాట అంటున్నప్పుడు పీరుభాయి వయస్సు నలభైఅయిదుకు మధ్య ఉంటుంది. ఆయన కొడుకు వయసు పదిహేడు యిరవైకి మధ్య వుంటుంది. అప్పుడు లోకంలో పందొమ్మిది వందల ఎనభైలు సమాప్తమవుతా ఉన్నాయి.

కొంత కాలానికి ఆ ఎనభైలు పోయి తొంభైలు వచ్చాయి. తొంభైలు నెట్టుకుంటా తొంభై ఆరులొచ్చాయి. ఆ ఆరులతోపాటు ఊరవతల మూడు రెడీమేడ్ గార్మెంట్ ఫ్యాక్టరీ లొచ్చాయి.

ఫ్యాక్టరీలంటే పొగ గొట్టాలు, సైరన్ మోతలూ ఉండే రాజుపాలెం చక్కెర ఫ్యాక్టరీల్లాంటివి కావు. పొడుగ్గా ఉండే పెద్ద పెద్ద రేకుల షెడ్లు అంతే. వాటిలో వందలాది కుట్టుమిషన్లు ఉంటాయి. వాటిని కుట్టేదానికి వందలాది కుట్టుకూలోళ్లు ఉంటారు. క్షణాల్లో వందలాది రెడిమేడ్ చొక్కాలు గుట్టలుగా పడుతుంటాయి అడ.

మా కావలికి 'సెకండ్ బాంబే' అని పేరు. ఊరు గుప్పెడే అయినా గుడ్డలంగళ్లు గంపెడన్ని. హోల్‌సేల్‌లో కొనుక్కోవాలనుకునేవాళ్లు మద్రాసు, పాండిచ్చేరి నుంచి కూడా మా ఊరికి వస్తా ఉంటారు.

ఇక్కడ గుడ్డలు సలీసు కాబట్టి వాటికంటే కుట్టు కూలీయే జాస్తి గాబట్టి ఈ రెండింటినీ కలిపి సలీసుగా అందిద్దామన్న ఆలోచన మా ఊరి యాపారస్తులకి వచ్చింది. అంటే మా ఊరిలో రెండుమీటర్ల చొక్కాగుడ్డ కొనాలంటే నూటిరవై అవుతుంది. ఇంక కుట్టుకూలి ముప్పయి రూపాయలు. బాంబే టైలర్స్ లాంటోళ్లయితే నలభై రూపాయలదాకా తీసుకుంటారు. కాబట్టి మొత్తం మీద నూటాభై రూపాయలైనా లేందే ఒక చొక్కా తయారుగాదన్నమాట. ఈ కతను కాస్త చిన్నది చేసి వంద రూపాయలకే చొక్కా అందిస్తే ఎట్టా ఉంటుంది అని ఆలోచించారు యాపారస్తులు. అట్టా ఆలోచించిన వెంటనే ఫ్యాక్టరీలు వచ్చిపడ్డాయి. వాటిలో ఆటోమాటిక్ కటింగ్ మిషిన్లు ఊడిపడ్డాయి. కుట్టుకూలోళ్లుగా పని చేయడానికి మనుషులు పరిగెత్తుకుంటూ వచ్చినారు.

ఇంకేమి? పని మొదలయ్యింది. ఊరి మీదకు రెడీమేడ్ చొక్కాలు గాలివానలా వచ్చిపడినాయి.

అరవై రూపాయలకు చొక్కా. వంద రూపాయలకు చొక్కా, నూటేభై పారేస్తే యింకా మంచి చొక్కా. రకరకాల ఫ్యాషన్లు, రకరకాల డిజైన్లు.

ఏం జరుగుతా వుందో మా ఊరి టైలర్లకు అర్థం గాలా. అర్థమయ్యేలోపు జరగాల్సింది జరిగిపోయింది. చొక్కాలు కుట్టించుకునే వాళ్లతోపాటు చొక్కాలు కుట్టే కుట్టుకూలోళ్లు కూడా తగ్గిపోయారు.

"నీ దగ్గర కూలిచేస్తే రోజుకు నలభై యాభై కూడా గిట్టుబాటు కావడంలా. ఫ్యాక్టరీలో చేస్తే కావాల్సినంత వస్తా ఉంది," అని షాపు ఓనర్లకు దండం పెట్టి ఫ్యాక్టరీ దిక్కున నడవడం మొదలుపెట్టినారు.

ఆ మాట సత్యమే. ఫ్యాక్టరీలో పనికి ఢోకా ఉండదు. ఖాతాలు పోతాయేమోనన్న భయం వుండదు. రోజుకు పది చొక్కాలు కుట్టు. పది పదులు తీసుకుపో. అయిదు ప్యాంట్లు కుట్టు. అయిదు యిరవైలు తీసుకుపో. కటింగ్ చేసే బాధలేదు. రేట్లు పెరిగిపోయిన మెటీరియల్‌ని కొనలేమని బెంగలేదు. అన్నీ సేటు ఇస్తాడు. కట్ చేసేదానికి ఆటోమాటిక్ మిషను ఉంది. చేయాల్సిందల్లా సత్తువ కొద్దీ కుట్టడమే.

అలా కుట్టడమే సుఖమనుకున్నారు చాలా మంది. ఫస్టు కొన్ని బంకులు మూతపడినాయి. ఆ తర్వాత కొన్ని షాపులు ఖాళీ అయినాయి. కొందరు టైలర్లు పక్కూళ్లకు వలసపోయినారు. ఒకరిద్దరు ఆటోలు కొనుక్కుని కావలి- ముసునూరికి మధ్య నడుపుకునే డ్రైవర్లయినారు.

యింక మిగిలింది పరువుకీ పంతానికీ నిలబడ్డ షాపులు మాత్రమే. వాటికి ధైర్నం చెప్పడానికి వున్న బాంబే టైలర్సు మాత్రమే.

పీరుభాయి కత్తెర పట్టి కత్తిరించడం చాలా అరుదైపోయింది. రోజూ షాపుకు వస్తానే ఉన్నాడు. తెరిచి కూర్చుంటూనే ఉన్నాడు. సాయంత్రమైతే మూసుకొని పోతానే ఉన్నాడు. కొడుకు ఏమనడానికి లేదు. అయ్యతోపాటే వస్తాడు. అయ్య మొఖం చూస్తా కూర్చుంటాడు. లేదంటే అంజీ హోటలు కాడికెళ్లి టీలు తాగుతా కూలబడతాడు.

అతడికి ఏదైనా చేయాలని ఉంది. పీరుభాయిని ఇంట్లో కూచోబెట్టి సాకాలని ఉంది. కానీ దోవలా వేరే లాదరువూలా.

పీరుభాయి సంపాదన యిద్దరు కూతుర్ల పెళ్లిళ్లకే అయిపోయింది. ఉన్న కాస్తోకూస్తో ఇన్నాళ్లూ నెట్టుకు రావడంతో తీరిపోయింది. ఇప్పుడు ఇల్లు, షాపులలో మిగిలిన రెండు మిషన్లు తప్ప వేరే ఏమీలా.

ఆ రెండు మిషన్ల మీదే ఆరుమంది బతకాలి. అమ్మా నాయనా, కొడుకూ కోడలూ, ఇద్దరు పిల్లలు.

పీరుభాయికి యిదేమీ పట్టదు. రేపు ఎట్టరా అనే చింత ఉన్నట్టుగా మనిషి అవుపించడు. షాపుకి వచ్చి కూర్చున్నాడంటే చల్లటి చెట్టు కింద కూర్చున్నట్టే ఆ మనిషికి.

"నీ పని అయిపోయిందయ్యో పీరయ్య," అని ఎవరైనా చనువుకొద్దీ తమాషాచేస్తే నవ్వి ఊరుకుం టాడు.

"ఎట్ట బతకబోయేది పీరుభాయ్," అని మా నాయనలాంటోళ్లు బాధపడినా అదే నవ్వు.

"పైన దేవుడుండాడు. చేతిలో విద్య వుంది. నాకేం దిగులు," అని అనేవాడు.

కాలేజీలకీ, షికార్లకీ నాబోటోళ్లు రెడీమేడ్ చొక్కా లేసుకొని కనపడితే దగ్గరికి పిలిచి, "రేయ్ బచ్చే... ఈ చొక్కా నువ్వేసుకోవచ్చు... మీ నాయనేసుకోవచ్చు... సచ్చిపోయిన మీ తాత గూడా వేసుకోవచ్చు... ఒకమ్మకీ ఒకబ్బకీ పుట్టిన చొక్కాలు కావురా యియ్యి," అనేవాడు.

"లూజు ఫిటింగులొచ్చి మా పొట్టగొట్టాయి గదరా," అని విచారపడేవాడు.

ఒకరోజిట్టాగే షాపు మూసే టైముదాకా కూర్చొని ఇల్లు చేరుకున్నాడు పీరుభాయి. బీబీ రొట్టెలు చేసింది. కోడలు పిల్లల్ని పడుకోబెడుతూ ఉంది. నీళ్లు పోసుకుని రొట్టెలు తినేటప్పటికి టైము తొమ్మిదయ్యింది. కొడు కింకా ఇల్లు చేరలా. పదిదాకా చూశాడు. ఇంకా రాలా.

"తాళాలిచ్చేసి పో. వెనకనే వస్తా," అని చెప్పిన కొడుకు. యింకా మూసి రాకుండా ఏం చేస్తున్నట్టు?

లేచి బయలుదేరినాడు.

షాపు దగ్గర పడింది. లోపలి నుంచి టకటకమని మిషనుమోత వినిపిస్తా వుంది.

పీరుభాయి గుండెలు గుబగుబలాడాయి. కుట్ట డానికి ఒక్క కొత్త గుడ్డ కూడా రాలేదు, వీడేంకుడు తున్నాడా అని గబగబా అడుగులేసి లోపలికి తొంగి చూశాడు.

చెమటలు కక్కతా, ఒంచిన తల ఎత్తకుండా హైరానాగా కుడుతున్నాడు కొడుకు. సూది కింద నుంచి పాత ఖాకీ ప్యాంటేదో జారతా ఉంది. ఏనాటి ప్యాంటో, ఎవరికో ఆల్టరు చేసి పెడుతున్నాడు.

పీరుభాయికి చల్లగా చెమటలు పట్టినాయి. గుండె పట్టేసినట్టయ్యింది. కాళ్లు ఒణికి కళ్లల్లో నీళ్లు తన్నుకొచ్చినాయి.

"నాయనా! అబయా," అన్నాడు.

అలుక్కున్న కళ్లల్లో నుంచి ఆయనకు కొడుకు రూపం కనిపించడం లేదు. పట్టు షేర్వాణీ గుడ్డలు, లక్నో రేషమ్ గుడ్డలు, పొందూరు ఖద్దరు గుడ్డలు తన కాళ్ల కింద తాన్లు తాన్లుగా పొరాడిన పాతరోజులు కనిపిస్తా ఉన్నాయి. రాజాలాగా అజమాయిషీ చేస్తా గల గలమని కబుర్లు చెబుతా రోజుకు ఒక్క చొక్కా కూడా కుట్టకుండా ఆరు కొట్టడానికి ముందే దర్జాగా యింటికి వెళ్లిపోయే కొడుకు కనిపిస్తా ఉన్నాడు.

ఆ కొడుకు ఇవాళ ఇలా పాతగుడ్డలు కుట్టు కుంటా కనిపించేసరికి తమాయించుకోలేక, తట్టుకోలేక రెండు చేతులు సాచి, "నాయనా! అబయా," అన్నాడు మళ్లీ.

ఒక్క ఉదుటున లేచి పసిపిల్లాడిలా అల్లుకు పోయినాడు కొడుకు. తండ్రి బుజాన్ని కన్నీళ్లతో తడపతా మాట్లాడినాడు.

"నాయనా! మనం యింక యీ బతుకు బతక లేము. మన విద్య పనికిరాదు. ఊరంతా ఒకదారైతే మనదొకదారనే రోజులు పోయినాయి. నామాట విను. బాడిగ కట్టడానికి కూడా గతి లేని ఈ షాపుని మూసే ద్దాం. మనం కూడా ఫ్యాక్టరీలో చేరిపోదాం. నువ్వూ నేనూ కలిస్తే రోజుకు రెండొందల రూపాయలు సంపాదిం చడం క్షణాల్లో పని. దిగులుండదు, చింతుండదు. పిల కాయలు పస్తులతో పడుకోవాల్సిన ఖర్మuండదు. ఒప్పుకో నాయనా, నా మాటిని ఒప్పుకో."

వెక్కిళ్లలో ఉన్న కొడుకుని సముదాయించలేక పోయినాడు పీరుభాయి.

"అట్నే నాయనా. ఊరుకో. ఊరుకో," అని కొడుకుని మరింత గట్టిగా అదుముకున్నాడు.

ఆ రాత్రి పీరుభాయికి నిద్రలేదు. మంచం మీద మసలతానే ఉన్నాడు. మధ్య మధ్యలో నీళ్లు తాగి మళ్లీ పడుకుంటా ఉన్నాడు.

ఆయన తాపత్రయం చూసి, 'ఏయ్యా,' అంది బీబీ.

''ఏమిలా,'' అన్నాడు పీరుభాయి.

''యింద బతుకు బతికావు. యియ్యాల యింకొకరి చేతికిందికి పోవాల్సి వస్తా ఉంది.

''పులిలాంటోడివి. అయితేమందిలే. ఇట్నే బతుకుదాము. ప్రాణాలేమీ పోవుగానీ ఫ్యాక్టరీకి పోబాకా,'' అని, పయిటతో కళ్లు తుడుచుకుంది బీబీ.

''అబ్బెబ్బే... అట్టాంటిదేమీలా,'' అన్నాడు పీరుభాయి.

''చేరకపోతే ఎట్టా,'' అన్నాడు మళ్లీ.

తెల్లారి అజాన్ వినిపించడంతోటే తాళాలు తీసుకుని రైల్వేరోడ్డుకు వచ్చాడు. తలెత్తి బాంబే టైలర్స్ బోర్డును చూసుకున్నాడు. షాపు తెరిచి ఒకసారి మిషన్లనీ, బల్లనీ చూసుకున్నాడు. బయట కుర్చీ వేసుకొని బుగ్గ కింద పాన్ అదిమిపెట్టి ఆ చల్లటిగాలిలో మౌనంగా కూర్చున్నాడు.

పదకొండు గంటలకు వచ్చాడు కొడుకు.

''నాయనా, ఫ్యాక్టరీ వాళ్లతో మాట్లాడొచ్చినా. ఇవాళ రమ్మన్నారు. వెళ్లి పని ఖరారు చేసుకొని వస్తే రేపట్నించి చేరిపోవచ్చు,'' అన్నాడు. తండ్రి మొఖంలోకి చూడలేక చూపుల్ని నేలలోకి దించి పెట్టాడు.

లేచి నిలబడినాడు పీరుభాయి. నాగూరు దర్గా పటం ముందర నిలబడి దువా చేసి, ''పద నాయనా,'' అన్నాడు.

దడదడమనే మిషన్ల మోతతో అదిరిపోతా ఉంది ఫ్యాక్టరీ. వరుసగా వందలాది మిషన్లు. గుడ్డల్లో కలగలిసిపోయిన కుట్టుకూలోళ్లు. గుట్టలు గుట్టలుగా పడి వున్న ఇస్త్రీ చేయని చొక్కాలు.

లోపలికొచ్చి నిలబడి- అందర్నీ తేరిపార చూస్తున్న పీరుభాయిని గమనించి, ఆయన ఎందుకొచ్చాడో అర్థంకాక, అర్థమయ్యాక మనసు ఆగక బిక్కచచ్చి గబగబా ఆయన్ను చుట్టుముట్టారు ఐదారు మంది. వాళ్లంతా ఒకప్పుడు పీరుభాయి శిష్యులే.

''ఉస్తాద్. ఏంది మీకీ కర్మ,'' అన్నారు నీళ్లింకిపోయిన మొఖాలతో.

పీరుభాయి నవ్వినాడు.

''మీరంతా ఈడుంటే నేనొక్కణ్ణే ఆడుంటే ఎట్టరా,'' అన్నాడు.

''అదిగాదు ఉస్తాద్. మీకేమైనా కావాలంటే మేము లేమా. అడిగితే ఎట్టోకట్ట చేసి ఆ మాత్రం సర్దలేమా. అన్నం పెట్టిన చేతుల్ని ఖాళీగా ఉండనిస్తామా ఉస్తాద్,'' అన్నారు.

''ఏంబళ్లా. యియ్యాల్టి నుంచి నేనూ మీతోటే. మీరూ నాతోటే. అందరం కలిసి పని చేసుకుందాం. పాండి. పాండి. పని చేసుకోపాండి,'' అని వాళ్లను బలవంతంగా పంపించేసినాడు.

ఇంతలో సూపర్‌వైజర్ వచ్చినాడు. పీరుభాయిని గుర్తుపట్టి సలాం చేసినాడు.

''మీరు రేపటి నుంచి పనిలోకి రావచ్చు. ఏ రోజు కూలి ఆరోజు ఇస్తాం. సెలవులుండవు. పనిచేసిన రోజే జీతం. సబబేనా?'' అన్నాడు.

''సబబేలేవయ్యా,'' అన్నాడు పీరుభాయ్.

రిజిష్టర్లో పేర్లు రాసుకుంటూ, ''అయితే మీ నెంబరు ముప్పయి ఆరు. మీ అబ్బాయి నెంబరు అరవై నాలుగు,'' అన్నాడు సూపర్‌వైజరు.

పీరుభాయికి అర్థం కాలేదు.

''నెంబర్లేంది,'' అన్నాడు.

''ఈడ పేర్లుండవు. నెంబర్లుంటాయి. మిషను నెంబర్లే మీ నెంబర్లు. ముప్పయి ఆరు అని పిలిస్తే మీరు పలకాలి,'' అన్నాడు సూపర్‌వైజరు నవ్వుతూ.

పీరుభాయి పెదాల మీద కూడా ఒక నవ్వు మొలిచింది. 'అట్నే,' అన్నాడు.

కొడుకు చేయి పట్టుకొని కదలబోతా ఉంటే, ''పీరుభాయ్! మాట,'' అన్నాడు సూపర్ వైజరు.

''ఏంది?'' అన్నాడు పీరుభాయి.

సూపర్‌వైజరు మొఖంలో రొంత యిబ్బంది కనిపించింది.

''చెప్పవయ్యా సామీ,'' అన్నాడు పీరుభాయి.

''అది కాదు పీరుభాయ్! నువ్వు నాకు తెలుసు. నీ కత ఊరంతటికీ తెలుసు. కానీ యీడ మాకొక మొగుడున్నాడు. మేనేజరు. మద్రాసు నుంచి తెచ్చి మా నెత్తిన పెట్టారు. వాడిదో రూలు. పనిచ్చే ముందు కుట్టి చూపించాల. యాపారంగదా. క్వాలిటీ దెబ్బ తింటే నష్టం గదా. పని చేతకానోళ్లు చేరిపోతారేమోనని వాడి డౌటు. కుట్టింది చూసి వాడు ఓకే అంటేనే పని. నీకు వంక పెట్టేవోడు బూమండలం మీద లేడు. అయినాగానీ మా మేనేజరు కోసం ఒక చొక్కా కుట్టి చూపించు. ఊరికే. మాటవరసకి. వాడి మొఖాన కొడతా.''

ఆ మాటలకి తండ్రి ఏమైపోతాడా అని బెదిరిపోయి చూసినాడు కొడుకు.

పీరుభాయి చెదరలా.

''అలాగే,'' అన్నాడు.

సూపర్‌వైజర్ వెళ్లి కటింగ్ టేబుల్ మీద పడున్న ఒక గుడ్డపీలికల కట్టని తీసుకొచ్చి యిచ్చాడు.

''మిషను కట్ చేసిన కొలతలు కదా. రొంత చూసుకొని కుట్టు,'' అని వెళ్లిపోయాడు.

ఆ కట్టను అందుకుంటా వుంటే, దానిని చేతు ల్లోకి తీసుకుంటా వుంటే ఆయన ముసలివేళ్లు కంపించి నాయి. మిషను ముందు కూర్చుని కళ్లద్దాలను సరి చేసుకొని వొణికే వేళ్లతోనే కట్టను విప్పాడాయన.

ఆయనకు ఏమీ కనిపించడం లేదు. చీకటి చీకటిగా అనిపించింది.

''సలాములేకుమ్ పీరుభాయ్,'' అనే మాటలు వినిపిస్తా ఉన్నాయి.

''పని నేర్పి ఉస్తాద్,'' అని కాళ్లకి నమస్కారం చేసే శిష్యులు కనిపిస్తా ఉన్నారు.

''బాంబే టైలర్సుగారూ బాగున్నారా,'' అనే పలక రింపులు గుర్తుకొస్తా ఉన్నాయి.

''నీ అంత కరెక్టుగా కుట్టే మొగోడు లేడయ్యా,'' అనే పొగడ్తలు చెవిన చేరుతున్నాయి.

''ముప్పయి ఆరంటే మీరే పలకాలి,'' సూపర్ వైజరు వెక్కిరిస్తా ఉన్నాడు.

చెమటతో ఆయన లాల్చీ తడిసిపోయింది. ఆయాసపడ్తూ లేచి నిలుచున్నాడు. అటూ ఇటూ చూసిన కొడుకును వెతుక్కున్నాడు. గబగబా వెళ్లి వాడు చేతులు పట్టుకున్నాడు.

''అబయా. వద్దురా. కుట్టబాకా. ఈ నాయాళ్ల కోసం మన పేరును పడుకోబెట్టబాక. నేనింకా చావలా. నా చేతిలో విద్యింకా చావలా. దీన్ని నమ్ముకునే బతుకు దాం. మన పేర్లతోనే బతుకుదాం. గౌరవంగా బతుకు దాం. పారా. పోదాం పా,'' అన్నాడు.

దిమ్మెరపోయి చూస్తున్న కొడుకు కదల్లా.

''నాయనా. ఏందిది?'' అన్నాడు.

''వొద్దురా. పాతగుడ్డలు కుట్టుకొని బతుకుదాం. ఆడోళ్ల రైకలు కుట్టుకొని బతుకుదాం. అదీ చేతగాకపోతే యింత విషం తీసుకొని మన షాపులో మనం చద్దాం. అంతేగానీ మనకీ పరీక్షలేందిరా. మనకు నెంబ ర్లేందిరా. రారా,'' అని లాగాడాయన.

కొడుకు కదల్లా.

''అబయా,'' అని గావుకేక పెట్టాడాయన. కొడుకు కళ్లల్లోకి అట్నే చూస్తూ 'థూ' అని ఊసి వెళ్లి పోయాడు.

ఆ తర్వాత వారంరోజులకి రైల్వేరోడ్డులోని బాంబే టైలర్సు షాపుని శుభ్రం చేశాడు పీరుభాయి. గోడలకు సున్నాలు వేయించాడు. మిషన్లకు వార్నీషు పూయించి నాడు. చాలా ఏళ్ల తర్వాత బోర్డు దించి మళ్లీ కొత్త బోర్డు రాయించినాడు.

మీరెప్పుడైనా కావలి వెళితే, రైల్వేరోడ్డులో నడిస్తే 'న్యూ బాంబే టైలర్స్' అనే ఆ కొత్త బోర్డు ఎత్తుగా అవు పిస్తుంది. కటింగ్ బల్ల అవతల తలెత్తుకొని నిలబడిన పీరుభాయి కనపడతాడు. కొండంత విశ్వాసం నింపు కున్న ఆయన పండు ముసలిముఖం కనబడుతుంది మళ్లీ బిగినయిన ఆయన కత కనబడుతుంది.

ఆ కతను చూసి రండి.

*చూపు కథల ప్రత్యేక సంచిక, నవంబర్-డిసెంబర్ 2000*

